ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 1 జనవరి 2025

రెండు రోజుల్లో రూ.42కోట్ల మద్యం విక్రయాలు

వైరా, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో డిసెంబరు చివరి రెండురోజుల్లో రూ.42కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. సోమవారం రూ.25కోట్లు, మంగళవారం రూ.17కోట్ల మద్యాన్ని వైరా ఐఎంఎల్ డిపో నుంచి సరఫరా చేశారు. అయినా 2023 డిసెంబరు కంటే 2024డిసెంబరులో రూ.44కోట్ల విక్రయాలు తక్కువగానే ఉన్నాయి. 2023 డిసెంబరులో రూ.264కోట్ల మద్యాన్ని విక్రయించగా గత డిసెంబరు 31నాటికి రూ.220కోట్లు మాత్రమే విక్రయించారు. చివరి రెండురోజులు రూ.42కోట్ల మద్యం విక్రయాలతో అధికార యంత్రాంగం కొంత ఊపిరిపీల్చుకుంది.



- తొలిరోజు మత్స్యావతారంలో భద్రాద్రి రామయ్య
- ఉత్సవమూర్తులు, ఆళ్వార్లకు అంతరంగిక స్నపనం
- రుత్వికులకు ఈవో దీక్షా వస్త్రాల అందజేత
- ఆలయ వైదిక పెద్దగా స్థానాచార్యులు
- సంప్రదాయబద్ధంగా 'తొలక్కం'
- నేడు కూర్మావతారం

అధ్యయనోత్సవాలు ఆరంభం

వివరాలు : 6లో



- అంబరాన్నంటిన న్యూ ఇయర్ వేడుకలు
- నృత్యాలు, బాణాసంచాతో యువత సందడి
- ఇరు జిల్లాల్లో కేకులు, మిఠాయిలతో సంబురాలు
- రంగవల్లులతో 2025కు స్వాగతం పలికిన మహిళలు
- నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నయా జోష్..

వివరాలు : 6లో

చిన్నారుల్లో స్మైల్

- రేపటి నుంచి 'ఆపరేషన్ స్మైల్'
- నెల రోజుల పాటు తనిఖీలు 6

బౌద్ధ స్థూపం అభివృద్ధికి రూ.2.50కోట్లు

- బుద్ధిస్టు సర్క్యూట్ ఏర్పాటుకు చర్యలు
- ఆర్కియాలజీ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ 6

'మట్టి' మేల్ తలపెట్టవోయ్..!

- భూసారపరీక్షలతో రైతులకు లాభం
- జిల్లాలో రెండు చోట్ల భూసారపరీక్ష కేంద్రాలు 6

రైతుభరోసాపై అపోహలకు తావులేదు

- మంత్రివర్గ సమావేశంలోనే విధివిధానాలపై నిర్ణయం
- దుష్ప్రచారాలను రైతులు నమ్మవద్దు
- సాగు చేసే ప్రతి రైతుకు 'భరోసా' ఇవ్వాలనేది నా వ్యక్తిగత అభిప్రాయం
- ఆయిల్‌పాం ఎంజీపీ కోసం ప్రధాని, కేంద్ర మంత్రిని కలుస్తాం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సత్తుపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రైతుభరోసా అమలుపై అపోహలకు తావులేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలపై ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న తరువాతనే విధివిధానాలు ఖరారవుతాయన్నారు. అందువల్ల రైతులు దుష్ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. సత్తుపల్లి మండలంలోని తన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడారు. రైతుభరోసాపై ఉపసంఘం చర్చించిన అంశాలను మంత్రివర్గ సమావేశంలో ఉంచి అక్కడ కూడా చర్చించిన తరువాతే ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోకుండానే అపోహలు, దుష్ప్రచారాలు చేయటం శోచనీయమన్నారు. రైతుభరోసాపై ప్రభుత్వ నిర్ణయం జరిపోయిందంటూ కొన్ని మీడియా సంస్థలు, ప్రతిపక్షాలు ప్రచారం చేయటం తగదన్నారు. (మిగతా 6వ పేజీలో)

సీఎం కప్ ఆర్చరీ పోటీలు ప్రారంభం

- తొలిరోజు ఎలిమినేషన్ రౌండ్ పూర్తి
- హాజరైన 150మంది కీడాకారులు
- నేడు తుది పోటీల నిర్వహణ

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల ఆర్చరీ పోటీలు మంగళవారం ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 33జిల్లాల నుంచి 150మంది క్రీడాకారులు, టీమ్‌మేనేజర్స్, టెక్నికల్ సిబ్బంది హాజరయ్యారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో తొలిరోజు ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో ఎలిమినేషన్ రౌండ్ నిర్వహించారు. బుధవారం తుది పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను ఖమ్మం డీవైఎస్‌వై సునిల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె నుంచి ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసి వారిని ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. వచ్చే ఒలంపిక్స్‌లో తెలంగాణ నుంచి పతకాలు సాధించే సత్తా గల క్రీడాకారులను వెలికి తీయడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో పోటీపడి విజయం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకరయ్య, జాతీయ కోచ్ రవిశంకర్, వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ, ఆర్చరీ కోచ్ నగేష్ పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ఇండియన్ రౌండ్ 40 మీటర్ల పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

అభివృద్ధిపై కొత్త ఆశలు

- నూతన సంవత్సరంలో పట్టాలెక్కనున్న పలు ప్రాజెక్టులు
- పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వం ఫోకస్
- మరింత ముమ్మరంగా సీతారామ ప్రాజెక్టు పనులు
- రాజకీయ పార్టీలకు 'స్థానిక' పరీక్ష

ఖమ్మం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నూతన సంవత్సరంలో కొత్తలు ఆశలు చిగురిస్తున్నాయి. 2025లో ఇటు అభివృద్ధి, అటు శాంతిభద్రతలు కీలకం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు, పథకాలు ఈ ఏడాది పట్టాలెక్కనున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికలు, వర్షాలు, వరదలతో అభివృద్ధికి ఆటంకాలు ఎదురయ్యాయి. 2025లో ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశించిన రీతిలో అభివృద్ధి పనులను పరుగు పెట్టించేందుకు ప్రభుత్వం, మంత్రులు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న సీతారామ ఎత్తిపోతల పనులు అన్ని ప్యాకేజీల పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. 2026 ఆగస్టు 15 టార్గెట్‌గా సీతారామ పనులు నిర్వహించాలని జిల్లా మంత్రులు భావిస్తున్నారు. అలాగే సీతమ్మ సాగర్ డ్యాం, జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం కూడా ఈ ఏడాది కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. అలాగే ఉమ్మడి జిల్లాలో పలుసాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, సాగర్ కాలవల ఆధునీకరణతో ఇరిగేషన్ రంగం కొత్తపుంతలు తొక్కే అవకాశం ఉంది. అలాగే జిల్లాలో పర్యాటకరంగంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు రూ.80కోట్లు నిధులు కేటాయించింది. పాలేరు నుంచి పర్ణశాల వరకు పర్యాటకరంగం పరుగులు తీయనుంది. పాలేరు జలాశయం, భక్తరామదాసు జన్మస్థలం, నేలకొండపల్లి బౌద్ధ స్థూపం, ఖమ్మంఖిల్లా, వెలుగుమట్ల అర్బన్‌పార్కు, వైరా రిజర్వాయర్, పులిగుండాల అటవీప్రాంతం, కిన్నెరసాని అందాలు గోదావరి తీరం, పర్ణశాల ఇలా ఉమ్మడిజిల్లాలో ప్రధాన పర్యాటక ప్రదేశాలతో పాటు జమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం, భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయం వంటి పుణ్యక్షేత్రాలు ఈ ఏడాది అభివృద్ధికి నోచుకోనున్నాయి. కూసుమంచి శివాలయంతో పాటు పలుఆలయాల అభివృద్ధికి నిధులు వచ్చే అవకాశం ఉంది.

ఎడ్యుకేషన్ హబ్‌గా ఖమ్మం జిల్లా..

నూతన ఏడాదిలో ఖమ్మం నగరం ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుంది. ఖమ్మంలో రూ.160కోట్లతో మెడికల్ కళాశాల భవనాలు, ఈ ఏడాది పూర్తికానున్నాయి. అలాగే మద్దులపల్లిలోని పాలేరు జేఎన్‌టీయూ కళాశాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.100కోట్లు కేటాయించింది. మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలకు పక్కా భవనాలు రాబోతున్నాయి. (మిగతా 6వ పేజీలో)

మిర్చి రైతుపై 'పేచీ' కత్తి

- కాంటాలు వేసే సమయంలో వ్యాపారుల కొర్రీలు
- క్వింటాకు రూ.900 తగ్గిస్తేనే కొనుగోళ్లు
- వ్యాపారుల తీరుపై ఖమ్మం వ్యవసాయమార్కెట్‌లో రైతుల నిరసన
- పంట ఎందుకు కొనుగోలు చేయరో చెప్పాలని డిమాండ్
- 'సిండికేట్'తో దోచుకుంటున్నారని ఆరోపణ

ఖమ్మం మార్కెట్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 'మూలిగే నక్కపై తాటిపండు' చందంగా ఉంది మిర్చి రైతుల పరిస్థితి. ఆరుగాలం కష్టించి, అప్పులు చేసి పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కక అరిగోస పడుతుంటే కొనుగోలు చేసిన పంటను కాంటాలు వేసే సమయంలో తేమ ఉందని, ఉబ్బులు ఉన్నాయని ధర తగ్గించాలని వ్యాపారులు పేచీలు పెట్టి రైతులను నట్టేట ముంచుతున్నారు. అసలే మార్కెట్‌లో ఇటీవల మిర్చికి అంతగా అంతర్జాతీయంగా, దేశీయంగా డిమాండ్ లేకపోవడంతో ఆశించిన ధర దక్కడం లేదు. ఆపై వ్యాపారులు ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు చేసిన పంటను కాంటాలు వేసే సమయంలో వ్యాపారులు పేచీ పెడుతున్నారు. దాంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఈ వ్యహారంపై ఖమ్మం మార్కెట్‌లో మంగళవారం రైతులు నిరసన తెలిపారు. ఖమ్మం మార్కెట్‌కు మంగళవారం కూసుమంచి మండలం (మిగతా 6వ పేజీలో)



చిన్నారుల్లో స్మైల్..

- రేపటి నుంచి 'ఆపరేషన్ స్మైల్'
- బాలలకు పునరావాసం
- నెల రోజుల పాటు తనిఖీలు

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నుంచి పారిపోయి, వచ్చిన, నిరాదరణగా తిరుగుతున్న బాలలను గుర్తించి సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ ఇచ్చి పునరావాసం కల్పించేందుకుగాను రూపొందించిన ఆపరేషన్ స్మైల్ 11వ విడత కార్యక్రమం బుధవారం (జనవరి 1) నుంచి ప్రారంభం కాబోతోంది. మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, కార్మిక, చైల్డ్‌లైన్, బాలల అబివృద్ధి అధికారి సమన్వయంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమం కోసం అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఆపరేషన్ స్మైల్ విధి విధానాలపై పోలీస్ అధికారులు సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనాథలను, బాలకార్మికులను గుర్తించడానికి ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు.

10 విడతల లెక్కలు ఎక్కడో..?

గత 10 విడతలుగా జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్లో ఎంత మంది అనాథలు, బాలకార్మికులను చేరదీసి పునరావాసం కల్పించారో లెక్కలు ఎక్కడ ఉన్నాయో అసలు అవి ఎవరికి తెలుసో చెప్పలేని పరిస్థితి. అంతేకాదు చేరదీసిన బాలకార్మికుల్లో ఎందరికి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారో తెలియని పరిస్థితి. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్లలో పట్టుకున్న చిన్నారులకు ఇప్పటివరకు ఎక్కడ ఆవాసం కల్పించారో ఎవరికీ అంతుపట్టడం లేదు.

అధికారిక లెక్కలివీ..

ఆపరేషన్ స్మైల్ మొదటి విడతలో 576, రెండో విడతలో 452, మూడో విడతలో 192, నాలుగో విడతలో 138, ఐదో విడతలో 90, 6వ విడతలో113, 7వ విడతలో 134, 8వ విడతలో 58, 9వ విడతలో 41, 10వ విడతలో 70 మందితో పాటు, ఆపరేషన్ ముస్కాన్లో మొదటి విడతలో సున్నా, రెండో విడతలో 385, మూడో విడతలో 178, నాలుగో విడతలో 134, ఐదోవిడతలో 185 మందిని, 6వ విడతలో జీరో, 7వ విడతలో 189, 8వ విడతలో 127, 9వ విడతలో 73, 10వ విడతలో 79 మందిని రెస్క్యూ చేసి పట్టుకున్నట్లు లెక్కల్లో చూపుతున్నారు.

బాలకార్మికుల గుర్తింపుకు, అనాథ బాలలను గుర్తించేందుకు అధికారులు నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. పోలీస్, ఐసీడీఎస్, చైల్డ్‌లైన్, కార్మిక శాఖ శాఖ ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి ఇటుకబట్టీలు, పరిశ్రమలు, దుకాణాల్లో తనిఖీలు చేయనున్నారు.



'మట్టి' మేల్.. తలపెట్టవోయ్

- భూసారపరీక్షలతో రైతులకు లాభం
- తగిన పోషకాలు ఉపయోగించే అవకాశం
- జిల్లాలో రెండు చోట్ల భూసారపరీక్ష కేంద్రాలు
- యాసంగి మట్టి నమూనాల లక్ష్యం 1905
- ఒక్కో పరీక్షకు రూ. 10 రుసుం.

ఖమ్మం వ్యవసాయం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఇష్టారీతిన రసాయనిక ఎరువుల వినియోగంతో సాగుభూమి సారం కోల్పోయి నిర్జీవంగా మారుతుంది. పంట భూమిలో నత్రజని, భాస్వరం, సేంద్రియ కర్బనాల్లాంటి పోషకాలు ఎంత మోతాదులో ఉన్నఆయో భూసార పరీక్షల ద్వరా తెలుసుకుని వాటికి తగ్గట్టుగా మొక్కలకు ఎరువులను అందిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది. భూసార ఫలితాల్లో ఏ భూమి తేలిక నేల, బరువు నేల తదితర విషయాలు తెలుస్తాయి. వ్యవసాయ భూముల్లో సహజంగా ఉండే పోషక పదార్థాల తోపాటు అదనంగా సేంద్రియ ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించ వచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

అందుబాటులో రెండు కేంద్రాలు..

ఖమ్మం జిల్లాలో రెండు భూసార పరీక్ష కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన ఖమ్మం జిల్లాకేంద్రంలో ఒక కేంద్రం ఉండగా, మరొక కేంద్రం సత్తుపల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ భూసార కేంద్రం. ఈ రెండు కేంద్రాల్లో మట్టి నమూనాలకు పరీక్షలు నిర్వహిస్తుంటారు. 2024 రబీ (యాసంగి) సీజన్‌కు సంబంధించి 1905 మట్టి నమూనా పరీక్షలు లక్ష్యంగా ఉన్నాయి. ఈ నమూనాలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది ద్వారా సేకరిస్తారు. ఒక వేళ రైతులు స్వచ్ఛందంగా మట్టి నమూనాలను ప్రయోగశాలకు తీసుకువస్తే ఒక్కో నమూనాకు రూ.10 రుసుం తీసుకుని పరీక్ష చేసి రిపోర్టులను అందజేస్తారు. మట్టి నమూనాలు సుమారు 1 ఎకరం నుంచి 5 ఎకరాల వరకు ఒక నమూనా చొప్పున సేకరిస్తారు.

రైతులకు లాభాలు ఇవీ..

భూపరీక్షల ద్వారా భూమి స్వభావం తెలుస్తుంది. మృత్తిక ఏ రకానికి చెందిందో తెలుస్తుంది. దానిలో ఉన్న పోషక పదార్థాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుంది. వాటిని బట్టి రైతులు పంటలు సాగు చేస్తే వృథా ఖర్చులు ఉండవు. పరీక్షా ఫలితాల్లో ఏ భూమి తేలిక నేల, బరువు నేల, మధ్యస్థంగా ఉన్న నేల అనే విషయాలు తెలుస్తాయి. నేలకు అమ్లగుణం ఉంటే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సున్నం వాడి స్థాయి తగ్గించవచ్చు.

నమూనాలనుసేకరించే విధానం..

పొలాల్లో పంట లేని సమయంలో మాత్రమే భూసార పరీక్షలకు మట్టి సేకరించాలి. నేల పొడిగా ఉన్నప్పుడు పొలం ఆరి ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలి. సరిగ్గా చెప్పాలంటే మార్చి నుంచి మే నెల మధ్య సేకరించాలి. పండ్ల తోటలు సాగు చేసే రైతులు చెట్లకు ఎరువు వేయక ముందే మట్టి నమూనాలు తీసుకోవాలి. మట్టి వేళ్లే లోతు వరకు, ఏక వార్షిక పంటలకు 15 నుంచి 30 సెంటీమీటర్లలోపు మట్టి నమూనాలను సేకరించాలి. పొలంలోని గట్ల వద్ద, పంట కాల్వల్లో సేకరించకూడదు. మొక్కలు, చెట్ల కింద, చెట్ల పక్కన ఉన్న మట్టిని సేకరించకూడదు. కంపోస్టు, పశువుల ఎరువుల కుప్పలు ఉంచిన చోట, బురదగా ఉన్న నేల నుంచి నమూనాలు పనికిరావు.

నమూనాలు తీసేటప్పుడు నేల పైభాగంలోని చెత్తాచెదారాన్ని తీసివేయాలి. తీసిన చోట తేమ ఎక్కువగా ఉంటే నమూనాను నీడలో ఆరబెట్టాలి. ఎండలో ఆరబెట్టకూడదు. మట్టిని ఒక చోట నుంచి కాకుండా 10 నుంచి 15 ప్రాంతాల్లో తీయాలి. ఎంపిక చేసిన పొలంలో జిగ్‌జాగ్ (ఎగుడు దిగుడు) పద్ధతిలో సేకరించాలి. మట్టి తీసేందుకు పొలంలో ఒక అంగుళం (2.5 సెంటీమీటర్లు) మందం పారతో పై నుంచి కిందికి గియాలి. అలా తీసిన మట్టిని పట్టా, చిన్న బకెట్‌లో సేకరించాలి.

మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కస్తాల సత్యనారాయణ తెలిపారు. గ్రూప్ -1 ప్రిలిమ్స్, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు, బ్యాంకింగ్ మొదలగు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారికి ఖమ్మం జిల్లాలో ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థులు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత శిక్షణకు 4 నెలలు సమయం పడుతుందని తెలిపారు. అర్హత ఆసక్తి వారు తమ దరఖాస్తుతో పాటు ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, డిగ్రీ మార్క్స్ మెమో, రెండు పాస్‌పోటోలను వి.వెంకటాయపాలెం లోని నూతన కలెక్టర్ ఆఫీసు భవన సముదాయములోని రెండవ అంతస్థులోగల జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయములో 10వ తేదీ లోపు అందించాలని కోరారు.

బాధిత కుటుంబానికి విద్యుత్ ఉద్యోగుల అండ



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న శేషగిరిరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదంలో తీవ్రగాయాలైన ఉద్యోగికి సంఘం నాయకులు, తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. ఇటీవల ఖమ్మం రూరల్ మండలం పమ్మి గ్రామంలో విద్యుత్ ప్రమాదం కాగా లైన్‌మన్ పున్నయ్యకు తీవ్రగాయాలైనాయి. దీంతో తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు తక్కెళ్లపల్లి శేషగిరిరావు ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుడు ఎస్. వెంకటేశ్వర్లు విరాళాలు సేకరించారు. మంగళవారం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు రూ.1,35,000 చెక్కును అందించారు.

పాలేరు పార్క్‌ను పరిశీలించిన టూరిజం అధికారుల బృందం

కూసుమంచి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పాలేరు పర్యాటక కేంద్రానికి మోక్షం లభించనుంది. పార్క్‌ను రాష్ట్ర పర్యాటకశాఖ అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. పార్క్ నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యాన్ని ఊటంకిస్తూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు పార్క్ అభివృద్ధికి నిధులు మంజూరుకు సిఫారసు చేయించారు. దీంతో రూ.5కోట్లు మంజూరు చేస్తు టూరిజం శాఖ నుంచి జీవో జారీ చేయనుంది. కార్యక్రమంలో టూరిజం ఎస్ఈ సరిత, డీఈ రామకృష్ణ, కన్సల్టెంట్ ఆర్కిటెక్ హరి, డీడీ రాములు నాయక్, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, తహసీల్దార్ కరుణశ్రీ, ఆర్ఐ జ్యోతి, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డితో తదితరులు ఉన్నారు.

బౌద్ధ స్థూపం అభివృద్ధికి రూ.2.50కోట్లు

- బుద్ధిస్టు సర్క్యూట్ ఏర్పాటుకు చర్యలు
- విదేశీ బౌద్ధులను ఆకర్షించేలా చర్యలు
- డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్

నేలకొండపల్లి, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): కారుకొండ, ఫణిగిరి, గాజులకొండ, చాడ, నేలకొండపల్లి, నాగార్జునసాగర్‌లను కలిపి బుద్ధిస్టు సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని ఆర్కియాలజీ, టూరిజం అభివృద్ధి శాఖలు కలిసి నిర్ణయించాయని ఆర్కియాలజీ డిప్యూటీ డైరెక్టర్ రాములునాయక్ చెప్పారు. మంగళవారం ఆర్కియాలజీ, టూరిజం అధికారులు నేలకొండపల్లి బౌద్ధ స్థూపాన్ని పరిశీలించారు. నేలకొండపల్లి బౌద్ధ స్థూపం అతి పెద్దదని, ఇక్కడకు బుద్ధులను ఆకర్షించటానికి చరిత్రను వెలికి తీయాలన్నారు. టూరిజం ఎస్ఈ సరిత మాట్లాడుతూ పాలేరుకు ఈసంవత్సరం బడ్జెట్లో రూ. 5కోట్లు కేటాయించారన్నారు. అందులో రూ.కోటి పెట్టి జెట్టి, స్పీడ్ బోటు, డీలక్స్ బోటు, రూ.4కోట్లతో టాయిలెట్లు, కాటేజీలు, రెస్టారెంట్లు, ఫౌంటెన్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నామన్నారు. టూరిజం, ఆర్కియాలజీ డిపార్టుమెంట్లు కలిసి బౌద్ధస్థూపాన్ని అభివృద్ధి చేస్తాయన్నారు. మంజూరైన 2.50 కోట్లలో రూ.50లక్షలు పాత బౌద్ధ ఆవారాలను అభివృద్ధి చేయటానికి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కియాలజీ ఏడి నర్సింగ్, టూరిజం అధికారి సుమన్‌చక్రవర్తి పాల్గొన్నారు. అధికారుల వెంట మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి ఉన్నారు.



బౌద్ధ స్థూపాన్ని పరిశీలిస్తున్న టూరిజం, ఆర్కియాలజీ అధికారులు

స్థూపాన్ని సందర్శించిన విదేశీయులు

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందిన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి బౌద్ధస్థూపాన్ని విదేశీ బౌద్ధ పరిశోధకులు మంగళవారం సాయంత్రం సందర్శించారు. నేలకొండపల్లి మహా బౌద్ధస్థూపాన్ని చూసిన విదేశీ పరిశోధకులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. తెలంగాణలో బౌద్ధ ఆరామాల అధ్యయనంలో భాగంగా న్యూజిలాండ్‌కు చెందిన ప్రొ.సారా, ఆస్ట్రేలియాకు చెందిన ప్రొ.జాఫ్రిషా బౌద్ధస్థూపాన్ని సందర్శించారు. విదేశీ పరిశోధకులకు చరిత్ర పరిశోధకుడు డా.ఈమని శివనాగిరెడ్డి బౌద్ధస్థూపం విశేషాలను వివరించారు. దాదాపు 40 సంవత్సరాల క్రితం జరిపిన తవ్వకాల్లో క్రీ.పూ.1-5 శతాబ్దాల మధ్య శాతవాహన, ఇక్ష్వాకు, విష్ణుకుండినకాలంలోని థీరవాద, మహాయాన, వజ్రయాన బౌద్ధానికి సంబంధించిన మహాస్థూపం బయట పడినట్లు చెప్పారు. అనంతరం విదేశీ బౌద్ధ పరిశోధకులు మహా బౌద్ధస్థూపం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నేలకొండపల్లి బౌద్ధస్థూపం చరిత్ర ఎంతో గొప్పదని విదేశీ బౌద్ధ పరిశోధకులు అన్నారు.

అధ్యయనోత్సవాలు ఆరంభం





స్వామి వారు మిథిలా స్టేడియంలోకి ప్రవేశిస్తున్న దృశ్యం, మహిళ భక్తుల కోలాటం

భద్రాచలం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు మంగళవారం సంప్రదాయబద్ధంగా ప్రారభమయ్యాయి. ముందుగా ఉత్సవ మూర్తులకు, ఆళ్వార్లకు అంతరంగికంగా ప్రత్యేక స్నపనం నిర్వహించారు. స్వామివారు తొలిరోజు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మత్స్యావతారంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ముందుగా నిత్యకల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొచ్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మత్స్యావతారుడైన రామయ్యను మేళతాళాలతో మిథిలా స్టేడియంలోని అధ్యయనోత్సవ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అధ్యనోత్సవాల నేపథ్యంలో ప్రతిరోజు స్వామివారికి తిరువీధి సేవను నిర్వహించనున్నారు. బుధవారం స్వామివారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సంప్రదాయబద్ధంగా తొలక్కం

అధ్యయనోత్సవాల్లో భాగంగా తొలిరోజు చతుర్వేద పారాయణం, రామాయణ పారాయణం చేసే రుత్వికులకు దీక్షావస్త్రాలను భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో దివ్యప్రబంధ పారాయణ తరుణంలో ఆలయ వైదిక పెద్దగా ఉన్న స్థానాచార్యులు కేఈ స్థలశాయికి మర్యాదపూర్వకంగా తిరుపరివట్టం(తలపాగ) కట్టారు. అనంతరం వేదాలు, ఇతిహాసాలు, పురాణం, భద్రాద్రి క్షేత్రమహత్యం, దివ్య ప్రబంధంలో అధ్యయనం ప్రారంభించారు. దీన్నే సంప్రదాయబద్ధంగా తొలక్కం అంటారు. ఈ సందర్భగా గంటపాటు నాళాయర దివ్య ప్రబంధంలోని పాశురాలను సేవాకాలం చేశారు. అంతకు ముందు శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహాలతో పాటు 12ఆళ్వార్ విగ్రహాలను నిత్య కల్యాణ మండపం వేదిక వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాసరావు, సీసీ శ్రీనివాసరెడ్డి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, కోటి రామస్వరూప్ రాఘవాచార్య పాల్గొన్నారు.

మిర్చి రైతుపై 'పేచీ' కత్తి



ఆందోళన చేస్తున్న రైతులను సముదాయిస్తున్న మార్కెట్ సిబ్బంది

(5వ పేజీ తరువాయి)

లింగారామ్‌తండాకు చెందిన వి. శ్రీను అనే రైతు సుమారు 30 బస్తాల మిర్చిని మార్కెట్‌కు తీసుకొచ్చాడు. సదరు పంటను ఓ వ్యాపారి మొదట క్వింటాలు రూ.15,200 ధరకు కొనుగోలు చేశాడు. అనంతరం పంట కాంటాలు వేసే సమయంలో సుమారు 5బస్తాల వరకు కాంటాలు వేసిన తరువాత ఈ పంట తనకు అవసంలేదని వదిలేసి అక్కడి నుంచి వెళ్లి పోయాడు. దీంతో అక్కడున్న రైతులు పంటను ఎందుకు కొనుగోలు చేయరో చెప్పాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో వ్యాపారులు అంతా సిండికేటుగా మారి రైతులను నిలువునా ముంచుతున్నారని ఆరోపించారు. కాగా మార్కెట్ యార్డులో గొడవ జరుగుతున్న విషయాన్ని గమనించిన మార్కెట్ సిబ్బంది ఆందోళన చేస్తున్న రైతులతో పాటు కొనుగోలు చేసిన వ్యాపారితో మాట్లాడారు. పంటకు మొదట నిర్ణయించిన ధర క్వింటాలుకు రూ.15,200లు కాకుండా క్వింటాలుపై రూ.900 తగ్గించి రూ.14,300లుగా నిర్ణయించి కాంటాల ప్రక్రియ నిర్వహించారు. దీంతో గొడవ సద్దుమణిగింది. ఇదిలా ఉండగా మంగళవారం మార్కెట్‌లో తేజా రకం కొత్త మిర్చిని క్వింటాలు రూ.15,511 జెండాపాట ధర నిర్ణయించారు.

వ్యాపారులు కావాలనే పేచీలు పెడుతున్నారు

శ్రీను మిర్చి రైతు, గంగారామ్‌తండా



మార్కెట్‌లో వ్యాపారులు ఉద్దేశ్యపూర్వకంగానే ధర తగ్గిస్తున్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే కాంటాలు వేసే సమయంలో పేచీ పెడుతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్ మాయాజాలంతో ధరలు తగిస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. పేచీ పెట్టడంతో ప్రతి రైతు క్వింటాకు రూ.900 నుంచి రూ.1,000 నష్టపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో దక్కుతున్న ఈ ధరలతో పెట్టుబడికి చేసిన అప్పులు కూడా తీరే పరిస్థితి లేదు. వ్యాపారుల తీరుతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రైతుభరోసాపై అపోహలకు తావులేదు

(5వ పేజీ తరువాయి)

రైతులు ఈ ప్రచారాలను నమ్మవద్దన్నారు. రైతుగా, వ్యవసాయ శాఖామంత్రిగా పంట సాగు చేసే ప్రతి ఒక్క రైతుకు ఏ రకమైన కోత లేకుండా రైతుభరోసా అందాలనేది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. ప్రభుత్వ నిర్ణయం జరిగేంతవరకు అధికారులతో పాటు ఎవ్వరూ దీనిపై స్పందించాల్సి అవసరం లేదన్నారు. రైతుభరోసాకు సంబంధించి రైతులకు మేలు చేసే సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు.

ప్రధాని, కేంద్ర మంత్రిని కలుస్తాం

రాష్ట్రంలో ప్రతి ఉమ్మడి జిల్లాలో కనీసం ఒక పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆయిల్‌పాంకు ఎంజీపీ (మినిమం గ్యారెంటీ ప్రైస్)లభించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. టన్నుకు రూ.20వేలు తగ్గకుండా ధర ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో కలిసి ప్రధాని, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణాన్ని అయిదు నుంచి పది లక్షల ఎకరాలకు పెంచాల్సి ఉందన్నారు.

రైతుల కోసం రూ.30వేల కోట్ల ఖర్చు..

గత ఏడాది కాలంలో రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేల కోట్ల మేర ఖర్చు చేసిందని మంత్రి తుమ్మల తెలిపారు. సాగునీరు, విద్యుత్ రంగాల తరువాత వ్యవసాయ రంగానికి ఈ స్థాయిలో ఒకే ఏడాదిలో ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. రుణమాఫీకి రూ.21వేల కోట్లు, రైతుబంధు రూ.7,625కోట్లు రైతుబీమా కోసం రూ.మూడు వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రకృతి వైపరిత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు రూ.పది వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసినట్లు తెలిపారు.

సన్న ధాన్యానికి రూ.అయిదు వందలు చొప్పున బోనస్ రైతుల ఖాతాలో జమచేశామన్నారు. గతంలో ఆగిపోయిన పథకాలను తమ ప్రభుత్వం పునరుద్ధరించిందని తెలిపారు.

నీటి తొట్టిలో పడి రెండేళ్ల బాలుడి మృతి



జూలూరుపాడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఓ రెండేళ్ల బాలుడు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి మృతి చెందిన ఘటన మంగళవారం భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేటతండాలో జరిగింది. మాచినేనిపేట తండాకి చెందిన లాకావత్ అశోక్-శివాని దంపతులకు ఐదేళ్ల కూతురు జాస్మిత, రెండేళ్ల కుమారుడు మంజునాథ్ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం బాలుడు తండ్రి అశోక్ పత్తి లోడ్ చేసేందుకు హమాలీ పనికి సుజాతనగర్ మార్కెట్‌కు వెళ్లాడు. తల్లి శివాని దుస్తులు నానపెట్టేందుకు ఇంటి ఆవరణలోని నీటి తొట్టి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో బాలుడు మంజునాథ్ కూడా ఆడుకుంటూ తల్లి వెనుకే నీటి తొట్టి వద్దకు వచ్చాడు. అయితే ఆమె బకెట్‌లో దుస్తులు నానపెడుతుండగా ఇంట్లోకి కోతులు రావడంతో ఆమె వాటిని తరమడానికి ఇంట్లోకి వెళ్లగా కుమారుడు మంజునాథ్ నీటితొట్టి సమీపంలోనే ఆడుకుంటున్నాడు. తల్లి కోతులను తరిమి వచ్చేసరికి కుమారుడు కనిపించలేదు. దీంతో ఇంటి చుట్టు పక్కల వెతికింది. అయినా కుమారుడు కనిపించకపోవడంతో చివరికి నీటి తొట్టిలో చూసింది. దాంతో కుమారుడు మంజునాథ్ నీటితొట్టిలో పడి ఉన్నాడు. షాక్ గురైన ఆమె వెంటనే విషయాన్ని చుట్టు పక్కల ఉన్న బంధువులకు చెప్పింది. వారి సహాయంతో బాలుడిని నీటి తొట్టిలో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. బాలుడు మృతితో మాచినేనిపేటతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

అభివృద్ధిపై కొత్త ఆశలు

(5వ పేజీ తరువాయి)

వీటితో పాటు ఖమ్మంలో స్వామినారాయణ ఇంటర్నేషనల్ స్కూల్, మధిర, పాలేరు, ఖమ్మంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ రాబోతున్నాయి.

మున్నేరుకు రెండువైపులా రూ.700కోట్లతో రిటర్నింగ్ వాల్స్, మున్నేరుపై తీగల వంతెన పనులు కూడా ఈ ఏడాది పూర్తికానున్నాయి. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిన అబివృద్ధి పనుల పూర్తి కానున్నాయి. అలాగే మధిరలో ఇందిరమ్మ డెయిరీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు పాడి ఉత్పత్తి ద్వారా ఉపాధి అందనుంది. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి కార్యచరణ సిద్ధమవుతోంది. మొత్తం మీద 2025 జిల్లాలో అభివృద్ధి పరుగులు తీసే అవకాశం ఉంది.

స్థానిక సమరానికి సై..

ఈ సంవత్సరం రాజకీయ పార్టీలకు మరోసారి ఎన్నికల పరీక్షలు రాబోతున్నాయి. వరుసగా పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు, మునిసిపాలిటీలకు, సహకారసంఘాలకు ఎన్నికలు రాబోతున్నాయి. ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు సవాల్‌గా నిలవనున్నాయి.

నయాజోష్

- అంబరాన్నంటిన న్యూ ఇయర్ వేడుకలు

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 'నూతన' సంబురం అంబరాన్నంటింది. చిన్నాపెద్దా తేడా లేకుండా అంతా కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ సందడిచేశారు. కొత్తసంవత్సరం సందర్భంగా దుకాణాల్లో రద్దీ పెరిగింది. మిఠాయిలు, కేక్‌ల కొనుగోళ్లకు జనం పోటీ పడ్డారు. అర్ధరాత్రి వరకు యువత డీజే స్టెప్పులతో సందడి చేశారు. రాత్రి 12గంటలకు హ్యాపీ న్యూఇయర్ అంటూ రోడ్లపైకి వచ్చి నృత్యాలు చేశారు. న్యూ ఇయర్ సందర్భంగా ఖమ్మం నగరంలో మంగళవారం రాత్రి దుకాణాలు సందడిగా మారాయి. షాపింగ్‌మాల్స్, దుకాణాలను విద్య దీపాలతో అలంకరించారు. పలు విద్యా సంస్థల హాస్టల్లో ఉండే విద్యార్థులు నృత్యాలు చేస్తూ కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. మహిళలు తమ ఇళ్లముందు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు తీర్చిదిద్దారు. జనవరి 1 సందర్భంగా నేడు ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి. నూతన సంవత్సర ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్పెషల్ డ్రంకెన్‌డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించారు.



స్వీట్లు కొనుగోలు చేస్తున్న దృశ్యం

మహారాష్ట్ర కూలీ బలవన్మరణం

కూసుమంచి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపురం సమీపంలో మహారాష్ట్రకు చెందిన కూలీ సింధీలాల్ కుంహియా(45) చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం మహారాష్ట్రకు చెందిన కొందరు కూలీలు మండలంలో పలుగ్రామాల్లో మిర్చి కాయలు ఏరేందుకు వచ్చారు. ఈ క్రమంలో కొందరు కిష్టాపురంలో వ్యవసాయక్షేత్రాల్లో గుడారం నిర్మించుకుని ఉంటున్నారు. సింధీలాల్ ఆర్థిక ఇబ్బందులతో, మానసిక రుగ్మలతో గురిఅవుతు ఉంటాడు. అదేవిధంగా మంగళవారం తెల్లవారుజామున గుడారాల సమీపంలో ఉరివేసుకొని చనిపోయాడు. ఇది గమనించిన స్థానిక రైతులు పోలీసులకు సమాచారం అందించారు. ఈమేర కు మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీధరాచారి తెలిపారు.

ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

బూర్గంపాడు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం బూర్గంపాడు మండలం సంజీవరెడ్డిపాలెం శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... బూర్గంపాడు మండల పరిధిలోని గౌతపురం కాలనీకి చెందిన తోకల సతీష్(37) అనే వ్యక్తి మంగళవారం సంజీవరెడ్డిపాలెం గ్రామంలోని ఓ రైతు వద్ద వ్యవసాయ పనులకు వెళ్లినట్లు తెలిపారు. పనులలో భాగంగా పొలానికి దగ్గరలో ఉన్న నీటిగుంటలో నుంచి నీళ్లు తేవడానికి వెళ్లాడు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో నీటి గుంట వద్దకు వెళ్లి పరిశీలించగా గుంతలో పడి మృతి చెంది ఉండడం గమనించారు. మృతుని కుటుంబసభ్యులకు, పోలీసులు సమాచారం అందించారు. మృతుడికి భార్య గంగ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం నగరంలో భారీ అగ్నిప్రమాదం

రూ.కోటి ఆస్తినష్టం

ఖమ్మంక్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో భారీ అగ్నిప్రమాదం జరిగిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఫైర్‌సిబ్బంది కథనంప్రకారం నగరంలోని ముస్తాఫనగర్ సమీపంలో ఉన్న రాజరాజేశ్వరి టెంట్‌హౌస్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురై ఫైర్‌షిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సమాచారం అందుకున్న జిల్లా ఫైర్ ఆఫీసర్ జి. అజయ్‌కుమార్ ఎస్‌ఎఫ్‌వో నాగరాజు సంఘటనస్థలం వద్దకు చేరుకుని మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. మొదట మంటలు ఆర్పుతున్న సమయంలో మంటలు అదుపులోకి రాకపోవడంతో పక్క డివిజన్‌లనుంచి ఫైరింజన్లు తీసుకువచ్చి మొత్తం నాలుగు ఫైరింజన్లతో 25మంది సిబ్బంది మంటలను అదపులోకి తెచ్చారు. ఈమంటలను ఆర్పివేసేందుకు సుమారు ఆరు గంటల సమయం పట్టింది. తెల్లవారుజాము సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరగడంతో స్థానికులంతా భయాందోళనకు గురయ్యారు. సమయానికి ఫైర్‌సిబ్బంది రాకపోయి ఉంటే ఆరీ ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.కోటి విలువ ఆస్తినష్టం జరిగిందని, ఫైర్ అధికారుల అంచనా వేస్తున్నారు. ప్రమాదంలో దగ్ధమైన టెంటు హౌస్ సామాన్లను జేసీబీ ద్వారా ట్రాక్టర్లు పెట్టి అధికారులు తరలించారు.

గుండెపోటుతో
అరవిందా స్కూల్ కరస్పాండెంట్ వీరబాబు మృతి

నేలకొండపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి అరవిందా స్కూల్ కరస్పాండెంట్, కామధేను రైతు ఉత్పత్తి సంస్థ అధ్యక్షుడు, నేలకొండపల్లి భక్త రామదాసు సర్వీస్ సొసైటీ మాజీ అధ్యక్షుడు నెల్లూరి వీరబాబు (64) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం స్వగ్రామం ముజ్జుగూడెంలోని పొలానికి వెళ్లి పని చేస్తుండగా హఠాత్తుగా కుప్పకూలి పోయినట్లు తెలుస్తున్నది. సమాచారం అందుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య సంఘటనా స్థలానికి చేరుకుని తన కారులో హుటాహుటిన ఖమ్మంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి వీరబాబు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఖమ్మంలోని ఆయన స్వగృహానికి తరలించారు. కుమార్తె విదేశాల్లో ఉండటంతో కుమార్తె వచ్చిన అనంతరం గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలుస్తున్నది. వీరబాబు మృతి సమాచారం తెలుసుకున్న భక్తరామదాసు సర్వీస్ సొసైటీ సభ్యులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో వ చ్చి మృత దే హాన్ని సందర్శించి నివాళులర్పించారు. సర్వీస్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నగాని శ్రీనివాస్, తెలగొర్ల లింగస్వామి, కోశాధికారి దండా రవీంద్రబాబు, మాజీ అధ్యక్షులు వెల్లంపల్లి శ్రీనివాస్, గెల్లా జగన్మోహనరావు, కార్యవర్గ సభ్యులు భవనాశి దుర్గారావు, గెల్లా వెంకటరమణగుప్తా, చావా గణపతిరావు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తొర్తి గురవయ్య, తొలపనూరి రత్నకుమార్, పెద్ది జగన్నాధం, కాంగ్రెస్ మండల నాయకుడు వేగినాటి లక్ష్మీనర్సయ్య తదితరులు నివాళులర్పించారు.



వీరబాబు (ఫైల్)

భద్రాచలం బీహెచ్‌ఈఎల్ బస్ సర్వీస్ పునరుద్ధరణ

భద్రాచలం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్‌లోని హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు వెళ్లే బస్సు సర్వీసులను బుధవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తున్నట్లు ఆర్టీసీ డీఎం తిరుపతి వెల్లడించారు. సూపర్‌లగ్జరీ బస్సులను ఉదయం 10 గంటలకు, రాత్రి 10.45కు భద్రాచలం నుంచి బయలుదేరుతాయని తెలిపారు. అలాగే బీహెచ్‌ఎఈఎల్ నుంచి ఉదయం 5.45కి, రాత్రి 10.45కు భద్రాచలానికి బయలుదేరుతాయని తెలిపారు. ఇదిలా ఉండగా మూడు నెలల క్రితం ఆర్టీసీ అధికారులు భద్రాచలం బీహెచ్‌ఎఈఎల్ సర్వీసులను ఎంజీబీఎస్‌కు కుదించడంతో ప్రయాణీకుల నుంచి తీవ్ర ఆక్షేపణలు వ్యక్తమయ్యాయి.

నాణ్యమైన
వైద్య సేవలు అందజేయాలి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

రామవరం ఎంసీహెచ్ తనిఖీ

చుంచుపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందజేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. మంగళవారం రామవరం ఎంసీహెచ్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పర్యవేక్షించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరును ఆరా తీశారు. మందుల పంపిణీ సజావుగా జరుగుతుందా, ఓపీ సేవలను అడిగి తెలుసుకున్నారు. డెలివరీ వచ్చే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలను అందించాలని సూచించారు. మందులను ఆసుపత్రి ఆవరణంలోనే ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఎట్టి పరిస్థితుల్లో బయట నుంచి తెచ్చుకోమని రోగులకు, కుటుంబ సభ్యులకు సూచించవద్దని హెచ్చరించారు. ఆసుపత్రిలో ఎంతమంది వైద్యులు, సిబ్బంది పని చేస్తున్నారని డ్యూటీ డాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల కొరత, సిబ్బంది నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసివేసి ల్యాబ్‌ను తక్షణమే తెరిపించి పరీక్షలు నిర్వహించాలని వైద్య అధికారులను ఆదేశించారు.

గుర్తుతెలియని వ్యక్తి
అస్థిపంజరం లభ్యం

ఖమ్మం క్రైం డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని బల్లేపల్లి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరం మంగళవారం లభ్యమైంది. ఖానాపురంహవేలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 45 సంవత్సరాల వయసు ఉన్న మగ వ్యక్తి అస్థిపంజరం బల్లేపల్లి సమీపంలోని ఓ ఖాళీస్థలంలో ఉన్నదని సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అస్థిపంజరాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో వెంటనే అన్నం శ్రీనివాసరావు సహకారంతో అస్థిపంజరంను ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇన్ఫోసిస్ ఫ్రీ ప్రగతి పాత్ టూ ఫ్యూర్‌కు కొత్తగూడెం సింగరేణి కళాశాల ఎంపిక

ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఇన్ఫోసిస్ ఫ్రీ ప్రగతి పాత్ టూ ఫ్యూర్‌కు కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఎంపిక అయిందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్ఫోసిస్ నిర్వహిస్తున్న ఈ 12 వారాల కెరీర్ డెవలప్‌మెంట్ ఆన్‌లైన్ శిక్షణ తరగతులను జనవరి నుంచి ఏప్రిల్ వరకు నిర్వహిస్తున్నామని, 18 సంవత్సరాలు పైబడిన విద్యార్థినులు అర్హులన్నారు. ఈ శిక్షణతో స్వీయ సమృద్ధి వృత్తిపరమైన పురోగతి కెరీర్ అభివృద్ధితో పాటు నాయకత్వం నైపుణ్యాలలో శిక్షణ పొందవచ్చు అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సింగరేణి మహిళా కళాశాల కో-ఆర్డీనేటర్‌గా డాక్టర్ దేవకి నియమించామన్నారు. ఎక్కువమంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగరేణి విద్యా సంస్థలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ గా తీర్చి దిద్దాలన్న దృఢ సంకల్పంతో సంస్థ సీఎండీ బలరాం ఆదేశాలనుసారం, ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ సారధ్యంలో కళాశాల వివిధ ఆన్‌లైన్ శిక్షణా తరగతులకు ఎంపిక అవుతుందని తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

దమ్మపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేరువేరు చోట్ల కోడి పందేలు నిర్వహిస్తుండగా మంగళవారం దమ్మపేట పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. రామచంద్రాపురం, వడ్లగూడెం గ్రామాలలో కోడిపందేలు నిర్వహిస్తుండగా ఎస్‌ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈఘటనలో నాలుగు కోడిపుంజలను, ఐదుగురు వ్యక్తులు, రూ5300లు స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

గురుకుల ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణం?
- మృతికి నిరసనగా బంధువులు,
- విద్యార్థిసంఘాల ఆందోళన



గురుకులం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు

మధిర రూరల్/ముదిగొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం కృష్ణాపురం వద్దగల సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మాడుగుల సాయివర్ధన్(17) అనే విద్యార్థి మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతి కి ప్రేమవ్యవహారమే కారణంగా తెలుస్తుంది. మృతిచెందిన విద్యార్థి జేబులో ప్రేమలేఖ దొరికింది. విద్యార్థి మృతిపై కళాశాల ఎదుట వారి బంధువులు, విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించాయి. కళాశాల సిబ్బంది నిర్లక్ష్యవైఖరి కారణంగానే మృతిచెందాడంటూ ఆరోపించారు. వివరాలిలా ఉన్నా యి. ఖమ్మంజిల్లా ముదిగొండకు చెందిన మాడుగుల రాంబాబు, సునీతకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఖమ్మంలో బీ ఫార్మసీ చదువుతుండగా, కుమారుడైన సాయివర్ధన్ కృష్ణాపురం వద్దగల సాంఘీక సంక్షేమశాఖ గురుకుల కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ విద్యార్థి ఈనెల 23వతేదీ క్రిస్మస్ సెలవులకు ఇంటికి వెళ్లి 30వతేదీ సోమవారం మధ్యాహ్నం తిరిగి కళాశాలకు వచ్చాడు. రోజులాగానే చదువుకొని రాత్రి భోజనం చేసి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయాడు. ఉదయం లేచి చూడగా సాయివర్ధన్ కన్పించకపోవడంతో గదులన్నీ వెతికారు. కళాశాల పైఅంతస్థు గదిలో సాయివర్ధన్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థి మృతికి ప్రేమవ్యవహారమే కారణమని తెలిసింది. మృతిచెందిన విద్యార్థి జేబులో ప్రేమలేఖ ఉంది. తాను ఓ యువతిని ప్రేమిస్తున్నట్లు ఆ యువతిపై లేఖలు రాశాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని ఉరివేసుకొని సాయివర్ధన్‌ను కిందకు దించి పరీక్షించారు. అయితే ఇతను బ్లా క్ కలర్ చున్నీతో ఉరివేసుకోవడంతో ఆ చున్నీ కూడా సెలవులకు వెళ్లినప్పుడు ఇంటి వద్దనుంచే తెచ్చుకొని ఉంటాడని భావిస్తున్నారు. వైరా ఏసీపీ రెహ్మాన్, మధిర, వైరా సీఐలు మధు, సాగర్, ఎస్‌ఐ లక్ష్మీభార్గవి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సాంఘీక సంక్షేమశాఖ జిల్లా అధికారులు గురుకుల కళాశాల వద్దకు చేరుకొని వి ద్యార్థి మృతదేహాన్ని పరిశీలించి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. శవాన్ని పోస్టుమార్టం ని మిత్తం మధిర ఆసుపత్రికి తరలించారు.



సాయివర్ధన్ (ఫైల్)

పోలీసులపై విద్యార్థి బంధువుల ఆగ్రహం

గురుకుల కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న సాయివర్ధన్ మృతదేహాన్ని తాము వచ్చేవరకు ఉంచకుండా ఆఘమేఘాల మీద మధిర ప్రభుత్వ ఆసుపత్రికి ఎందుకు తరలించారని వారి తల్లిదండ్రులు రాంబాబు, సునీతతోపాటు వారి బంధువులంతా బోరున విలపిస్తూ పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో వాగ్వాదానికి దిగారు. తాము వచ్చేవరకు మృతదేహాన్ని కదిలించొద్దని ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి చెప్పినా మృతదేహాన్ని ఎందుకు తరలించారని నిలదీశారు. దీంతో అరుపులు, కేకలతో కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది.

విద్యార్థి సంఘాల ఆందోళన...

విద్యార్థి మృతి విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు గురుకుల కళాశాల వద్దకు చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాదాపు రెండుగంటలసేపు ఆందోళన కొనసాగింది. కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమని, ఆయనను సస్పెండ్ చేయాలని, విద్యార్థి కుటుంబానికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ఎంత నచ్చజెప్పినా వినకుండా బైఠాయించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను, హౌస్‌మాస్టర్ మోషాను సస్పెండ్ చేస్తున్నట్లు ఆర్డీవో నర్సింహారావు ప్రకటించారు. కు టుంబంలో ఒకరికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని ఆర్డీవో తెలిపారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా ద్విచక్రవాహన దొంగల అరెస్టు

ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ముగ్గురి అరెస్టు...పరారీలో ఒకరు

కూసుమంచి సీఐ సంజీవ్

నేలకొండపల్లి, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు ద్విచక్ర వాహన దొంగలను నేలకొండపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 6 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు కూసుమంచి సీఐ సంజీవ్ తెలిపారు. మంగళవారం నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ మంగళవారం ఉదయం నేలకొండపల్లి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముజ్జుగూడెం క్రాస్‌రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలిందన్నారు. మరింత లోతుగా విచారించగా మొత్తం 9 ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు తేలిందన్నారు. అందులో 6 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన చల్లా రవి, గండగుల వీరబాబు, అనంతు నాగేంద్రబాబులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ముజ్జుగూడేనికి చెందిన రేపాకుల గాంధీ పరారీలో ఉన్నాడన్నారు. వీరు నలుగురు ఒక గ్రూపుగా ఏర్పడి నేలకొండపల్లి, సూర్యాపేట జిల్లా కోదాడ, ఖమ్మం, కొత్తగూడెలలో వాహనాలను దొంగిలిస్తున్నట్లు తేలిందన్నారు. నేలకొండపల్లికి చెందిన పాత ఇనుము వ్యాపారి నాగరాజు దొంగిలించిన వాహనాలను విడదీసి స్క్రాప్ కింద అమ్ముతున్నాడన్నారు. వీరందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. వాహన దొంగలను పట్టుకున్న నేలకొండపల్లి పోలీసులను సీఐ సంజీవ్ అభినందించారు. విలేకరుల సమావేశంలో నేలకొండపల్లి, కొండపల్లి, కూసుమంచి ఎస్‌ఐలు పెంటరి సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

సైబర్ మోసం.. రూ.22 వేలు స్వాహా

ఖమ్మంరూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఓటీపీ నెంబరు చెప్పడంతో రూ.22 వేలు స్వాహా అయిన సంఘటన ఖమ్మంరూరల్ మండలం నాయుడుపేటలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ సీఐ రాజు కథనం ప్రకారం మండలంలోని నాయుడుపేటకి చెందిన మనోజ్‌కుమార్ ఫోన్‌కు లింక్‌లు వచ్చాయి. ఆ లింక్‌ను ఓపెన్‌చేయగా ఓటీపీలు వచ్చాయి. ఓటీపీ నెంబరు చెప్పాలని మరో మెసేజ్ రావడంతో ఓటీపీ నెంబరు చెప్పడం జరిగింది. అనంతరం గంట తర్వాత తన బ్యాంకు ఖాతాలోని రూ.22వేలు మాయమయ్యాయి. దీంతో సైబరనేరగాళ్ల ఉచ్చులో పడిపోయానని గుర్తించిన మనోజ్‌కుమార్ వెంటనే రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ మాట్లాడుతూ పొరపాటున ఖాతాలో డబ్బులుపో యిన వెంటనే గుర్తించి గంటలోనే 1930 లేదా సైబర్‌క్రైం పోర్టల్‌లో ఫిర్యాదుచేస్తే డబ్బులు వెనక్కి వచ్చే అవకాశాలుంటాయని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీకోసం వచ్చిన పార్సిల్ లేదా మీరు పంపిన ప్యాకేజీలో డ్రగ్స్ కనుగొన్నారని ఎవరైనా ఫోన్ చేసి చెబితే ప్రతిస్పందించవద్దని సూచించారు.

రహదారులపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోండి

పంచాయతీ రాజ్ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

దమ్మపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రహదారులపై నీరునిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పీఆర్ ఈఈ శ్రీనివాస్‌ను వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరరావు ఆదేశించారు. గండుగులపల్లిలోని ఆయన నివాసంలో పీర్ ఈఈ శ్రీనివాస్, డీఈ శ్రీధర్ తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసారు. రహదారులపై నీరు నిల్వ ఉండటం వల్ల రహదారులు కొద్ది రోజులకే దెబ్బతింటున్నాయని గ్రామాలలో రహదారులపై నీరు రాకుండా గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. అదే విదంగా రహదారులపై ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లు నడపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ తీగల కింద మెక్కలు నాటవద్దని అవరసమైతే పూలమొక్కలు నాటాలని సూచించారు. శ్రీరాంపురం నుంచి రెడ్యాలపాడు గ్రామం వరకు రహదారి నిర్మాణానానికి, మల్కారం నుంచి ఉసిర్లగూడెం గ్రామం వెళ్లే రోడ్డు నిర్మాణానానికి ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. అశ్వారావుపేట మండలంలోని గుబ్బల మంగమ్మ ఆలయవద్ద అపరిశుభ్రంగా ఉంటుదని దేవాలయ పరిసర ప్రాంతాలు శుభ్రంగా వుండే విదంగా సరిహద్దు ప్రాంతాల ఎస్‌ఐలతో సమన్వయం చేసుకుంటూ దేవాలయం ప్రాంతం పరిశుభ్రంగా ఉంచే విదంగా చర్యలు తీసుకోవాలని అశ్వారావుపేట సీఐని కరుణాకర్‌ను ఆయన ఆదేశించారు. పూసుకుంట అభివృద్ధి పనులపై మంత్రి ఆరా తీశారు.

అధికారులతో సమన్వయం చేసుకుంటూ పూసుకుంట అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని కొయ్యల అచ్యుతరావుకు మంత్రి సూచించారు. మంత్రి తుమ్మలను కలిసిన వారిలో దమ్మపేట సొసైటి ఛైర్మన్ ఎల్లిన రాఘవరావు, దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, మన్నెం అప్పారావు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, కేవి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వరద బాధిత విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద బాధిత ప్రాంతాల విద్యార్థుల పదోతరగతి సర్టిఫికెట్లను మంగళవారం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అందించారు. జిల్లాలో మొత్తం 369 మంది అభ్యర్థులు పదోతరగతి సర్టిఫికెట్లు వరదల్లో కోల్పోయినట్లు దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం మొత్తం30మంది అభ్యర్థులు డూప్లికేట్ సర్టిఫికెట్లను తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తెలిపారు. మిగిలి అభ్యర్థులు జనవరి 15లోపు తీసుకోవాలని తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	18 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	40
బీరకాయ	44
పచ్చిమిర్చి	44
కాకరకాయ	44
బెండకాయ	38
పొట్లకాయ	50
దోసకాయ	38-40
చిక్కుడు	54
నాటుచిక్కుడు	68
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	24
దొండ	54-60
సొరకాయ	20
క్యారెట్	48
క్యాప్సికం	74
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	180
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

గడువు పెంచితేనే ఇందిరమ్మ సర్వే పూర్తి

- కేఎంసీ పరిధిలో ఇప్పటి వరకు 74శాతమే సర్వే
- మరో వారం రోజులైతేనే నూరుశాతం పూర్తి
- ముగిసిన తొలి షెడ్యూల్



సర్వే చేస్తున్న బృందం

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు31(ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్లు కావాల్సిన వారు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం నగరంలోనే 53,990 కుటుంబాల వారు ఇళ్లు లేదని దరఖాస్తులు చేశారు. కాగా ఈనెల 11నుంచి ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఇందిరమ్మ సర్వే ప్రారంభమైంది. కేఎంసీలోని 60డివిజన్లలో కావాల్సిన మేరకు సర్వే బృందాలు అందుబాటులో లేక పోవటంతో సర్వే ప్రారంభంలో పలుఅడ్డంకులు ఏర్పడ్డాయి. తర్వాత మెప్మా నుంచి సీవోలు, కేఎంసీ కార్యాలయం ఉద్యోగులు, ఆర్పీలు, అంగన్‌వాడీలతో బృందాలను నియమించారు. దీంతో చేయటంతో సర్వే పట్టాలెక్కింది. తొలుత సర్వేకు సర్వర్ ఇబ్బందులతో ఖమ్మం నగర పాలక సంస్థలో సర్వే మందకొడిగానే కొనసాగిందని విమర్శలు వెలువడ్డాయి. ఇందిరమ్మ సర్వేను డిసెంబరు 11 నుంచి 31వరకు నూరుశాతం పూర్తి చేయాలని ప్రభుత్వం తొలి షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు మంగళవారంతో గడువు ముగిసింది. అయితే కేఎంసీ పరిధిలో మొత్తం 53,990 కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేయగా వాటిలో 38,600 దరఖాస్తులను సర్వే పూర్తి జరిగింది. 74శాతం సర్వే జరిగాయి. ఇంకా 26శాతం మేరకు సర్వే జరగాల్సి ఉంది. రోజుకు సరాసరిగా 2వేల దరఖాస్తులు కేఎంసీలోని సర్వే బృందాలు ఆన్‌లైన్ చేస్తున్నాయి. దీంతో మరో వారం రోజుల వరకు సర్వే కొనసాగితేనే ఇందిరమ్మ సర్వే నూరుశాతం లక్ష్యం నెరవేరుతోంది.

కొన్ని డివిజన్లలో సర్వే భేష్

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 60డివిజన్లుండగా కార్పొరేటర్లు సహకరించి, సర్వే బృందాలు యాక్టీవ్‌గా ఉన్న ప్రాంతాల్లో సర్వే ఆశాజనకంగాసాగింది. 24వ డివిజన్ 100శాతం, 28వడివిజన్‌లో 98శాతం, 20వడివిజన్ 95శాతం, 35వ డివిజన్ 94శాతం, 48వ డివిజన్ 94శాతం, 58వ డివిజన్ 93శాతం ఇందిరమ్మ సర్వే పూర్తి జరిగాయి. మరో పది డివిజన్లు 80శాతంకు పైగా సర్వే పూర్తి చేసుకున్నాయి.

పలువురు పోలీసు సిబ్బందికి సేవా పతకాలు

ఖమ్మంక్రైం,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో పల విభాగాలలో విధులు నిర్వహిస్తూ సేవలు అందించినందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అధికారులకు, సిబ్బందికి పతకాలను ప్రకటిస్తూ పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు మంగళవారంరాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో మహోన్నత సేవాపతకానికి ఖమ్మంటౌన్ ఏసీపీ ఎస్‌వి.రమణమూర్తి, సీఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ షేక్.సయ్యద్ ఎంపిక అయ్యారు.ఉత్తమ సేవాపతకానికి ఖమ్మం సీఏఆర్ విభాగంలోని ఏఆర్ఎస్ఐలు జి.రమణమూర్తి, యం.వెంకటేశ్వర్లు, సీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుళ్ళు ఎస్.హర్షా, బి.వెంకటేశ్వర్లు ఎంపిక అయ్యారు. సేవాపతకానికి అదనపు డీసీపీ అడ్మిన్ ఏ.నరేష్ కుమార్, ఎస్సైలు ఆర్.నాగేశ్వరరావు, జి.వెంకయ్య, ఏఆర్ఎస్సై మహ్మద్ యాకూబ్‌షరీఫ్, హెడ్‌కానిస్టేబుళ్లు యండీ.అబ్దుల్, ఖలీక్, డి.వెంకటేశ్వరరావు, కె.బ్రహ్మాచారి, గుజ్జు హరి, బి.వెంకన్న, టి.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాస్, జి.శంకర్‌రావు, సీహెచ్.రవీందర్, జి.వెంకటేశ్వర్లు,ఎండీ సలీం పాషా, ఐ.రాంబాబు, జె.శ్రీనివాదసరావు, జి.వీరయ్య, బి.క్రిష్ణమూర్తి, సైబర్‌సెక్యూరిటి హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు, టీజీఎస్‌పీడీసీఎల్ ఎస్ఐ కె.రామప్ప, కానిస్టేబుల్ కె.వాసు ఎంపిక అయ్యారు. అగ్నిమాపక శాఖ విభాగంలో వైరా ఎస్ఎఫ్‌వో శ్రీనివాసరావు సేవాపతకానికి ఎంపిక అయ్యారు.

ఉషకు మరో అంతర్జాతీయ పురస్కారం



ఖమ్మంటౌన్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఖమ్మానికి చెందిన ప్రముఖ రచయిత్రి, కవయిత్రి బండి ఉషకు మరో అంతర్జాతీయ అవార్డు సొంతం చేసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల జాతర సందర్భాన్ని పురస్కరించుకొని వెలువరించిన చారిత్రాత్మకమైన ప్రతిష్టాత్మకమైన మహాసంకలనం పుస్తకానికి ఈ అవార్డు లభించింది. సుమారు 200మంది డాక్టరేట్లు, 200కు పైగా తెలుగుపండితులు, మరో 100కు పైగా ప్రముఖులు, పలువురు సినీకవులు రాసిన కవిత్వం, పద్యాలతో ఆత్మగౌరవ ప్రతీక పేరుతో సుమారు 700 పేజీలతో బండి ఉష ఈ సంకలనాన్ని తీసుకువచ్చారు. దీనికిగాను ఆస్ట్రేలియాకు చెందిన రికార్డుల నమోదు సంస్థ స్టార్ గోల్డ్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు పేరిట బండి ఉషకు అవార్డు అందచేశారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాకు చెందిన స్టార్ గోల్డెన్ రికార్డ్సు భారత ప్రతినిధులు ఇటీవల బండి ఉషకు ఖమ్మంలో జరిగిన ఒక కార్యక్రమంలో అంతర్జాతీయ పురస్కారం అందచేశారు.

ఆత్మహత్యాయత్నం చేసిన రైతుకు పరామర్శ

ఖమ్మంటౌన్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన రైతు కనుమతరెడ్డి శ్రీనివాసరెడ్డి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడటంతో, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు చెందిన శ్రీనివాసరెడ్డికి చెందిన స్వంత స్థలంలో కాంగ్రెస్ నేతలు పోలీసుల సహకారంతో దౌర్జన్యంగా సీసీ రహదారి నిర్మాణం చేపట్టారని, ఈ విషయమై శ్రీనివాసరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటంతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డరన్నారు. సీపీ సునీల్‌దత్‌ను కలిసి చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యాయత్నం కేసులో ఆయన భార్యను అక్రమంగా పోలీస్‌కస్టడీలో ఉంచారని, ఇందుకు సంబంధించి సంబంధిత సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీని కోరారు.

గణపేశ్వరాలయం అభివృద్ధికి ప్రతిపాదనలు

- పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

కూసుమంచి,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి):కూసుమంచిలోని ప్రసిద్ధ గణపేశ్వరాలయం అభివృద్ధికి రూ.3.30కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు క్యాంపుకార్యాలయం ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం గణపేశ్వరాలయం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించి దయాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కల్యాణ మండపం, పాకశాల, ఆఫీస్‌రూం, స్టోర్‌రూం, ఆర్చి గేటు, ప్రాకారం గోడ, శుభమండపం వంటి నిర్మాణాలకు ఇటీవల ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి నిధులకు ఎస్టిమేట్లు తయారు చేశారు. దీంతో నిధుల మంజూరీ కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు.

ధర్మకర్తల మండలి ప్రమాణం

ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా రేల ప్రదీప్‌రెడ్డిని నియమించగా, ఆయనతోపాటుగా కందుల వీరబాబు, నాగపూరి తిరుపతిరావు, చెన్ను రవి, హాలావత్ రెడ్య, నెల్లూరి జ్యోతి, ఎం.రమేష్ సభ్యులుగా ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఆలయ పూజారి శేషగిరిశర్మ ప్రమాణస్వీకారం చేశారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనీల్, ఈవో శ్రీకాంత్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణకర్త ప్రతాపరెడ్డి, నేలకొండపల్లి మార్కెట్‌చైర్మన్ సీతారాములు పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సాయివర్ధన్ ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం ఎస్సీ గురుకులంలో సాయివర్ధన్ ఆత్మహత్యపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీ.లక్ష్మణ్, వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డినికలిసి వినతిపత్రం అందించారు. తక్షణమే జిల్లా అధికారులు కిష్టాపురం ఎస్సీ గురుకులాన్ని తనిఖీ చేసి నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా గురుకులాల్లో విద్యార్థులకు రక్షణ కలుగు తుందన్నారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ చేయకపోవటం కారణంగానే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. నాయకులు శ్రీనివాస్, ప్రసాద్, అశోక్, అనిల్, నిఖిల్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

ఖమ్మంరూరల్,డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎంవీపాలెం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఎంవీపాలెం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, జలగంనగర్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఖమ్మంలోని గ్రేస్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, 5 కేజీల బియ్యం, స్నాక్స్‌ను మంగళవారం వితరణగా అందజేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. సంస్థ బాధ్యులు ఆదినారాయణ, రమేష్,జాన్ గ్రేస్ కళాశాల ప్రిన్సిపల్ వేణు, హెచ్‌ఎం జి.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4న ఉచిత మెడికల్ క్యాంపు

ఖమ్మంచర్చికాంపౌండ్,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): బోడేపుడి విజ్ఞాన కేంద్రం, సీపీఎం టుటౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల4న ఖమ్మంమంచికంటిహాల్‌లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీనెలా మొదటి శనివారం క్రమంతప్పకుండా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో బీపీ, షుగర్, మూర్ఛ, పక్షవాతం, తదితర అనారోగ్య సమస్యలకు ఉచిత పరీక్షతతో పాటు మందులు పంపిణీచేస్తున్నామన్నారు. డాక్టర్ అనిల్‌కుమార్, ప్రముఖ డెంటల్ సర్జన్ కె.రేష్మాదుర్గ హాజరవుతారని, ఉదయం ఆరుగంటలనుంచి 11గంటల వరకు ఈ క్యాంపు ఉంటుందన్నారు.

పల్లె,పట్టణ దవాఖానాలపై సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): పల్లెపట్టణ దవాఖానాల్లో వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలని ఉదయం ఓపీ సేవలు.. మధ్యాహ్నం ఫీల్డ్‌విజిట్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి కళావతిబాయి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ, పల్లె దవాఖాల పనితీరుపై సమీక్షించారు. ప్రతీ గ్రామంలో అంకితభావంతో ప్రజలకుసేవలు అందేలా చూడాలన్నారు. గర్భిణీ, చిన్నపిల్లలకు పరీక్షలు నిర్వహించి ఓపిలో నమోదు చేయాలన్నారు. డాక్టర్ సైదులు, డాక్టర్ రామారావు మాట్లాడుతూ గర్భిణీలకు సాధారణ డెలివరీలు చేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రజలలో వ్యాధులు ప్రబలకుండా భయాందోళనలు చెందకుండా అవగాహన కల్పించే బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డెమో సాంబశివరెడ్డి, డీపీవో దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మేయర్ పరామర్శ



ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 18వడివిజన్ ముస్తాఫానగర్‌లోని రాజరాజేశ్వరి టెంట్ హౌజ్‌లో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకొంది. విషయం తెలుసుకున్న మేయర్ పునుకొల్లు నీరజ వెంటనే కేఎంసీ డీఆర్ఎఫ్ బృందాలతో పాటుగా అగ్నిమాపకశాఖకు సమాచారం అందించి పిలిపించారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. నష్టం వివరాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

విద్యాలయాల్లో న్యూ ఇయర్ వేడుకలు

ప్రైవేటు విద్యాలయాల్లో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో చిన్నారు ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించారు. మిఠాయిలు పంచారు. 2024 వీడ్కోలు పలుకుతూ 2025కి స్వాగతం పలికారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



రెజోనెన్స్ శ్రీనివాసనగర్‌లో



రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీ



ఎస్‌బీఐటీలో..



స్మార్ట్‌కిడ్జ్‌లో..



బొమ్మలో..





నూతన సంవత్సర వేడుకలు


చింతకానిలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

చింతకాని, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని శ్రీ ఆదర్శ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. పదవ తరగతి పరీక్షలలో ఉన్నత ఫలితాలు సాధించాలని పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు రేణుక, వినీల, గోపిచంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్లూరులో...

కల్లూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కల్లూరులో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ప్రాజెక్టు పరిధిలో గల కల్లూరు, పేరువంచ సర్కిల్స్ పరిధిలో గల అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు ఈ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కల్లూరు సర్కిల్‌లో సీడీపీవో నిర్మలజ్యోతి కేక్ కట్ చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పేరువంచ సర్కిల్ పరిధిలో ఏసీడీపీవో రత్తమ్మ కేక్ కట్ చేశారు. ఇటీవల కాలంలో ఉద్యోగ విరమణ పొందిన పలువురికి చీరలను అందిస్తూ శాలువలతో సీడీపీవో నిర్మలజ్యోతి, సూపర్‌వైజర్ సంధ్యారాణిలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ భవానీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వేంసూరులో....

వేంసూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేక్‌ను తహసీల్దార్ ఎంఏ.రాజు కట్ చేశారు. కార్యక్రమంలో డీటీ చిరంజీవి, ఆర్ఐ శ్రీనివాసరావు, మహేష్, సునీత పాల్గొన్నారు.


కల్లూరులో కేక్ కట్ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


సత్తుపల్లిలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న దృశ్యం


వేంసూరులో కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ రాజు

ఎన్నికల హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈ సంక్రాంతి కల్లా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అన్నిటినీ అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో డివిజన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం ఎన్నికల సంఘం స్వేచ్ఛను హరిస్తూ కాలం గడపాలని చూస్తుందన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలలో వేస్తున్న కమిటీలు కాంగ్రెస్ పార్టీ కమిటీల మాదిరిగా ఉన్నాయని, అన్ని పార్టీల నేతల ప్రమేయంతో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మోరంపూడి పాండు, మాచర్ల భారతి, మాదినేని రమేష్, చలమాల విఠల్, జాజిరి శ్రీను, కొలికపోగు సర్వేశ్వరరావు, శీలం సత్యనారాయణరెడ్డి, గాయం తిరుపతిరావు, జాజిరి జ్యోతి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక కబ్జాపై విచారణకు ఆదేశం

▸▸ మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత

మధిరటౌన్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. మధిర టౌన్‌లో ఇటీవల కబ్జాకు గురైన మదిర శ్మశానవాటిక స్థలంపై విచారణకు ఆదేశించారు. సమావేశంలో మునిసిపల్ ఛైర్మన్ కమిషనర్ కౌన్సిల్ సభ్యులు జరిగిన మధిర మునిసిపల్ కౌన్సిల్ జనరల్‌బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మధిర మునిసిపాలిటీలో రూ.మూడు కోట్ల భూకుంభకోణం శ్మశానస్థలం ఆక్రమణ తదితర అంశాలపై పూర్తి విచారణ చేసి నిజానిజాలను పట్టణ ప్రజలకు తెలియచేయాలని కౌన్సిలర్ మల్లాది వాసు మునిసిపల్ కమిషనర్‌ను కోరారు. ఈసందర్భంగా మల్లాది వాసు మాట్లాడుతూ మధిరలో జరిగిన నాలా, శ్మశానవాటిక భూముల కబ్జాలు కూడా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి హైడ్రాను ప్రయోగించి స్థలాలను కాపాడుతామని అన్నారు. ఈసమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత మాట్లాడుతూ ఈకబ్జాల అంశంపై విచారణకు ఆదేశిస్తున్నట్టు ప్రకటించారు. ఇదే అంశంపై మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌ను వివరణ కోరగా రికార్డులను పరిశీలించి మ్యుటేషన్ రద్దు చేస్తామని తెలిపారు.

IN THE COURT OF HONOURABLE ADDL. JUNIOR CIVIL JUDGE AT SATHUPALLI
I.A.No.2/2024
IN
O.S.NO.58 / 2024

Between:
Challagulla Appa Rao
Petitioner / Plaintiff
and
Azmeera Srikanth
Respondent / Defendant

NOTICE

To
Azmeera Srikanth S/o Hari
Age : 26 Years, Occ : Business
R/o : H.No.3-85, C/o Bhukya Chavali, BC Colony Tallamada Village,Sathupalli Mandal, Khammam District,
Cell No:6300067345

Please take notice that the petitioner / plaintiff filed above I.A.against you for attachment before juidgement for the petition schedule property. The above I.A is posted to 10-01-2025 for your appearnce. If you fail to appear before the Honourable Court on that day when the matter is called, you will be set exparte and matter will be heard and decided exparte

Sathupalli, Date : 31-12-2024
Katikala Venkateswarlu
Advocate - Sthupalli

IN THE COURT OF HONOURABLE ADDL. JUNIOR CIVIL JUDGE AT SATHUPALLI
O.S.NO.58 / 2024

Between:
Challagulla Appa Rao ....Plaintiff
and
Azmeera Srikanth ......Defendant

NOTICE

To
Azmeera Srikanth S/o Hari
Age : 26 Years, Occ : Business
R/o : H.No.3-85, C/o Bhukya Chavali, BC Colony Tallamada Village,Sathupalli Mandal, Khammam District,
Cell No:6300067345

Please take notice that the plaintiff filed above suit against you for recovery of money. The above suit is posted to 10-01-2025 for your appearance. if you fail to appear before the Honourable court on that day when the matter is called, you will be set exparte and the matter will be heard and decided exparte

(By order of the court)

Sathupalli, Date : 31-12-2024
Katikala Venkateswarlu
Advocate - Sthupalli

మెరుగైన ఫలితాల సాధన కోసం పని చేయాలి

▸▸ డీఈవో సోమశేఖరశర్మ


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో సోమశేఖరశర్మ

బోనకల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధన కొరకు ఉపాధ్యాయులు అంకితబావంతో పని చేయాలని డీఈవో సోమశేఖరశర్మ సూచించారు. బోనకల్ కేజీబీవీతో పాటు చిరునోముల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సామార్థ్యాలను పరిశీలించారు. కేజీబీవీలో పదవ తరగతి విద్యార్థులకు డీఈవో స్వయంగా గణితాన్ని బోదించారు. డిప్యూటేషన్ పై పని చేస్తున్న వారి పనితీరును అబినందించారు. స్టోర్ రూంతో పాటు పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిరునోముల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామార్థ్యాలను పరీక్షించగా వారు సక్రమంగా సమాధానాలు చెప్పక పోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు తక్కువగా ఉన్నా, ఆశించిన స్థాయిలో సామార్థ్యాలు లేకపోతే ఎలా అంటూ ఉపాధ్యాయుల పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దామాల పుల్లయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

కక్ష సాధింపు వల్లనే శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యాయత్నం

▸▸ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం రేజర్లలో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన వివాదం సందర్భంగా ఆత్మహత్యాయత్నం చేసిన కనమతరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఖమ్మం ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం పరామర్శించారు. శ్రీనివాసరెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక కాంగ్రెస్ నాయకులు కక్ష రాజకీయాలకు పాల్పడుతూ, శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని వేధించిన కారణంగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అన్నారు. శ్రీనివాసరెడ్డి క్రిమిసంహారక మందు తాగితే ఆసుపత్రికి తరలించిన పోలీసులు, అతని భార్యను పోలీస్టేషనుకు తరలించి అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. శ్రీనివాసరెడ్డికి తమ పార్టీ అండగా ఉంటుందని, ఎటువంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పారు.


ఖమ్మం ఆసుపత్రిలో శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న సండ్ర

విద్యారంగ సమస్యలపై పోరాటం

● జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్

ఏన్కూరు, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తుందని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. మంగళవా రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరనలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేస్తూ విజయాలు సాధిస్తుందన్నారు. ఈకార్యక్రమలో వినోద్, మనో జ్, విగ్నేష్, వీరన్న, నవీన్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి మనిషికి ఆచార్యుడు అవసరం'

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి ఆచార్యుడు అవసరమని, భగవంతుడు కూడా ఈ భూమ్మీదకు వస్తే ఆచార్యుడు ద్వారానే జ్ఞానాన్ని పొందుతాడని ప్రవచనకర్త, ఉపన్యాసరత్న నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్యస్వామి అన్నారు. మండలంలోని రేజర్లలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ధనుర్మాసం వ్రతంలో భాగంగా 16వ రోజు మంగళశారం వేడుకలు వైభవంగా నిర్వహించారు. అనంతరం రామకృష్ణమాచార్యను భక్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్తుపల్లితో పాటు కొత్తగూడెం, నారాయణపురం, బేతుపల్లి, పుట్రేల తదితర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

'మానవ అక్రమ రవాణాదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

వైరా, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా గురించి పూర్తిస్థాయి అవగాహనతో ఉండాలని పోలీసు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బాధ్యుడు నర్సింహారావు సూచించారు. మండలంలోని పాలడుగు హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన మానవ అక్రమ రవాణా నిరోధక చర్యలపై ఆయన ప్రసంగించారు. మానవ అక్రమ అనేది రోజురోజుకు పెరిగిపోతుందని దీని నివారణకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార పారాలీగల్ అధికారి మాధవిలత, ప్రధానోపాధ్యాయుడు ఇమానియేల్, సుజాత పాల్గొన్నారు.

కారేపల్లి మండల ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక

కారేపల్లి, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండల నూతన ప్రెస్‌క్లబ్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక శివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడిగా బీమవరం శ్రీనువాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బాదవత్ రాము, ఉపాధ్యక్షుడిగా కొత్తూరు శ్రీనువాసరావు, సహాయ కార్యదర్శిగా బానోత్ బాలునాయక్, కోశాధికారిగా పాలిక శ్రీనువాసరావు, గౌరవ సలహాదారులుగా కొండపల్లి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విలేకరులు పాల్గొన్నారు.

విశ్రాంత సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవితం గడుపుతున్న పెన్షనర్ల సమస్యలను గుర్తించి వారికి సంఘం ద్వారా సేవలను అందించడం అభినందనీయమని సత్తుపల్లి సబ్ ట్రెజరీ అధికారి సునీల్ అన్నారు. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, బుద్రద్దీన్, రవిచంద్ర రత్నం, ఆర్కే.ప్రసాద్, జీ.కృష్ణయ్య, మాధవరెడ్డి, సాంబశివరావు, రామిశెట్టి సుబ్బారావు, ఏఎస్.ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం, బోడేపూడి బాబు, సాంబశివరెడ్డి, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మొక్కపోచమ్మ జాతర

తల్లాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెంలో మొక్కపోచమ్మ దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం జాతర వైభవంగా జరిగింది. నర్సింహారావుపేట గ్రామం నుంచి మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో ట్రాక్టర్లపై ప్రభలతో ప్రదర్శనగా పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకుడు సుబ్రమణ్యశర్మ ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు వందలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చనగక్కాయల నరసింహారావు, సోద నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు